

కల్యాణం.. కమనీయం
సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా నిర్వహించారు.

ఘనంగా పద్మారాధన
విశాఖ: కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.





22న నృసింహ జయంతి 8లో
సింహాచలం: సింహగిరిపై ఈనెల 22న నృసింహ జయంతిని నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి తెలిపారు.

వెల్లివిరిసిన చైతన్యం

- ఓటు వేసేందుకు స్వచ్ఛందంగా వచ్చిన గిరిజనం
- ఉదయం నుంచి బారులు
- మారుమూల ప్రాంతాలకు పూర్తిస్థాయిలో రహదారులు
- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో భారీ భద్రత ఏర్పాట్లు
- రంపచోడవరం, పాడేరులో మహిళలదే పైచేయి

జిల్లాలో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. గత ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ శాతం పెరిగింది. మారుమూల ప్రాంతాల్లో సైతం రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో గిరిజనులు ఉత్సాహంగా ఓటుహక్కును వినియోగించుకున్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూడా పోలింగ్‌శాతం పెరిగింది. భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఓటుహక్కు వినియోగించుకున్నారు. రంపచోడవరం, పాడేరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషులు కన్నా మహిళలు, అరకువ్యాలీ అసెంబ్లీలో మహిళలు కన్నా కాస్త పురుషులు ఓటుహక్కును వినియోగించుకున్నారు.



దముకులోని ఓటు వేసేందుకు లైన్లో ఉన్న ఓటర్లు



ములియగుడలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు బారులు తీరిన ఓటర్లు

సాక్షి,పాడేరు/అనంతగిరి/పెదబయలు: జిల్లాలో ఓటర్లు పోటెత్తడంతో గతంలో కన్నా స్వల్పంగా పోలింగ్ శాతం పెరిగింది. 2019 ఎన్నికల్లో 69.76శాతం నమోదు కాగా ఈ ఎన్నికల్లో స్వల్పంగా పెరిగి 70.20 శాతం నమోదైనట్టు జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ విజయసునీత తెలిపారు. జిల్లా వ్యాప్తంగా పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లో 1021 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియ జరిగింది.

'రంప', పాడేరులో మహిళలు..
అరకులో పురుషులు..

జిల్లాలో పురుషులు కన్నా మహిళా ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో పురుషులు కన్నా 6,705 మంది, పాడేరు నియోజకవర్గంలో పురుషులు కన్నా 2,491 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అరకు వ్యాలీ నియోజకవర్గంలో మాత్రం మహిళల కన్నా 396 మంది పురుషులు ఎక్కువగా ఓటింగ్‌లో పాల్గొన్నారు.

రంపచోడవరంలో 3.03 శాతం తగ్గుదల

రంపచోడవరం అసెంబ్లీ నియోజకవర్గంలో 2019 ఎన్నికలతో పోల్చుకుంటే పోలింగ్ 3.03 శాతం తగ్గింది. అప్పటిలో 78.04 నమోదు కాగా ఇప్పుడు 75.01 నమోదైంది. గత ఎన్నికల్లో ఉదయం 7 నుంచి ఐదు గంటల వరకు పోలింగ్ సమయం ఉండగా ప్రస్తుతం గంట కుదించడం కూడా పోలింగ్ శాతం చూపి ఉండవచ్చని అధికారుల భావిస్తున్నారు. మారమూల ప్రాంతాల గిరిజనుల పోలింగ్ కేంద్రాలకు వచ్చేందుకు తగిన సౌకర్యాలు లేకపోవడం కూడా కారణంగా కనిపిస్తోంది. ఈ సమస్యపై రాజకీయ పార్టీల నేతలు కూడా దృష్టి పెట్టలేదు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ ఏర్పాట్లు చేసినా పోలింగ్ శాతం పెరగలేదు. వై.రామవరం మండలం గుర్తేడు, పాతకోట ప్రాంతాల్లోని ఆరు పోలింగ్ కేంద్రాల్లో సుమారు 50 శాతం వరకు ఓటుహక్కు వినియోగించుకున్నట్టుగా అధికారవర్గాలు చెబుతున్నాయి.

పాడేరులో 2.01శాతం పెరుగుదల : పాడేరు నియోజకవర్గంలో పోలింగ్ శాతం గత ఎన్నికల కన్నా కాస్త పెరిగింది. 2019 ఎన్నికల్లో 61.80 శాతం నమోదు కాగా ప్రస్తుత ఎన్నికల్లో 63.91 శాతం నమోదుతో 2.01 శాతం పెరిగింది. పాడేరు జిల్లా కేంద్రం కావడంతో రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉన్నందున ఓటుహక్కు వినియోగించుకునేందుకు గిరిజనులు తరలివచ్చారు. వర్షం వల్ల అక్కడక్కడ ఇబ్బందులు ఎదురైనా పోలింగ్‌పై ఎటువంటి ప్రభావం చూపలేదు. పోలింగ్ కేంద్రాల మార్పు కారణంగా ఇబ్బందులు పడ్డారు. చాలామంది గిరిజనులు ఓట్ల వివరాలు తెలియక వెనుదిరిగారు.

వెనుదిరిగిన బలగాలు



ముంచంగిపుట్టు చేరుకున్న కూంబింగ్ బలగాలు

ముంచంగిపుట్టు: ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతాల నుంచి పోలీసులు బలగాలు వెనుదిరిగాయి.సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ఉన్నతాధికారులు ముందస్తూ చర్యల్లో భాగంగా ముంచంగిపుట్టు, పెదబయలు, జి.మాడుగుల మండలాల్లో కూంబింగ్ నిర్వహించారు.పోలింగ్ జరిగే మారుమూల గిరిజన పల్లెలకు అనుకొని ఉన్న ఒడిశా సరిహద్దు ప్రాంతం అంతా గ్రేహౌండ్స్,స్పెషల్ పార్టీ పోలీసులు బలగాలు ఎన్నికలు జరిగే మూడు రోజుల ముందుగానే చేరుకొని కూంబింగ్‌ను చేపట్టాయి. అటవీ ప్రాంతమంతా అణువుణువునా జల్లెడ పట్టాయి.ఏవోబీ ప్రాంతం మొత్తాన్ని పోలీసులు వారి ఆధీనంలోకి తీసుకున్నారు. ఒడిశా ఎస్‌వోజీ పోలీసు బలగాలు సైతం కూంబింగ్‌ను నిర్వహించాయి. గతంలో మావోయిస్టుల కార్యకలాపాలు అధికంగా ఉండే భూసిపుట్టు, జామిగూడ, ఇంజిరి, కోంద్రుం, రంగబయలు, బుంగాపుట్టు, గిన్నెలకోట పంచాయతీల్లో ఓటింగ్ శాతం పెరిగింది. ఎప్పుడూ 40శాతం దాటని ఆయా పంచాయితీల్లో ఈసారి 50 నుంచి 70శాతం వరకు పోలింగ్ నమోదు అయింది.ఎన్నికలంతా ప్రశాంతంగా ముగియడంతో బలగాలు కూంబింగ్‌ను ముగించుకొని మండల కేంద్రానికి చేరుకున్నాయి.

అరకు పార్లమెంట్ పరిధిలో వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ శాతం
పాలకొండ	75.26
కురుపాం	78.54
పార్వతీపురం	78.23
సాలూరు	76.45
అరకు	71.12
పాడేరు	63.91
రంపచోడవరం	75.01
మొత్తం	73.68

అరకులో 1.67 శాతం పెరుగుదల : అరకు నియోజకవర్గంలో 2019 ఎన్నికలతో పోలిస్తే పోలింగ్ 1.67శాతం పెరిగింది. అప్పట్లో 70.45శాతం నమోదు కాగా ప్రస్తుత ఎన్నికల్లో 71.12శాతం నమోదైంది. రహదారులు, రవాణా సదుపాయాలు అందుబాటులో ఉన్నందున గిరిజనులు ఓటుహక్కు వినియోగించుకోగలిగారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కాస్త చురుగ్గా జరిగింది.

- మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పెద్ద ఎత్తున రహదారులు నిర్మించడంతో ఇంజరి, గిన్నెలకోట, చీకుపనస, భూసిపుట్టు ప్రాంతాల్లో వాహనాల్లో వెళ్లి గిరిజనులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంజరి పంచాయతీలోని ఇంజరి, చీకుపనస పోలింగ్ కేంద్రాల పరిధిలో 2008 మంది ఓటర్లకు గాను 1328 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు.
- గిన్నెలకోట పంచాయతీలోని రెండు పోలింగ్ కేంద్రాల్లో 1662 మంది ఓటర్లకు గాను 1232 ఓటు హక్కు వినియోగించుకోవడంతో పోలింగ్ 66శాతం నమోదైంది. పెదబయలు మండలంలో సీకరి, పెదబయలు, అడుగులపుట్టు కేంద్రాల్లో ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఉదయం నుంచి బారులు తీరారు.
- మావోయిస్టుల ప్రభావం లేకపోవడంతో గిరిజనులు స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆసక్తి చూపారు.
- గిరిజనులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు నాలుగు ప్రైవేట్ జీపులను అధికారులు ఏర్పాటు చేసి బుంగాపుట్టు నుంచి లక్ష్మీపురం పోలింగ్ కేంద్రానికి తరలించారు.
- కాలినడకన, గెడ్డలు, వాగులు దాటుకుంటూ వచ్చి, ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- మారుమూల గిరిజనులు ఓటు హక్కును వినియోగించుకునేలా అరకు అసెంబ్లీ రిటర్నింగ్ అధికారి, పాడేరు ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక చొరవ చూపారు.

2024 ఓటింగ్ వివరాలు

నియోజకవర్గం	ఓట్లు	పోలైనవి	మహిళలు	పురుషులు	ఇతరులు	శాతం
రంపచోడవరం	2,77,317	2,08,025	1,07,572	1,00,450	3	75.01
అరకులోయ	2,45,489	1,74,588	87,096	87,491	1	71.12
పాడేరు	2,48,387	1,58,747	80,618	78,127	2	63.91

2019 ఓటింగ్ వివరాలు

నియోజకవర్గం	ఓట్లు	పోలైనవి	మహిళలు	పురుషులు	ఇతరులు	శాతం
అరకువ్యాలీ	220773	155534	77139	78394	1	70.45
పాడేరు	227042	140319	70197	70121	0	61.80
రంపచోడవరం	260323	203154	----	----	----	78.04

భద్రత స్ట్రాంగ్

- స్ట్రాంగ్‌రూమ్‌లకు తరలించిన ఈవీఎంలు
- అభ్యర్థుల సమక్షంలో సీళ్లు
- పోలీసు బలగాలతో భారీ బందోబస్తు



అరకు అసెంబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌కు కలెక్టర్ సమక్షంలో సీలు వేస్తున్న అధికారి



పాడేరు అసెంబ్లీ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌కు సీలు వేస్తున్న ఆర్వో భావన వశిష్ట

సాక్షి,పాడేరు: జిల్లాలోని 1021 కేంద్రంలో నిర్వహించిన పోలింగ్ ప్రక్రియకు సంబంధించిన ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. పాడేరు,అరకులోయ అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఓట్ల లెక్కింపును పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి స్థానిక డిగ్రీ కళాశాలలో రెండు స్ట్రాంగ్ రూమ్‌లను ఏర్పాటుచేశారు. వీటిలో రెండు నియోజకవర్గాలకు సంబంధించి బరిలో ఉన్న అభ్యర్థులు, పార్టీ నేతల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు వివేకానందన్, కలెక్టర్ ఎం.విజయసునీత, పాడేరు,అరకులోయ ఆర్వోలు భావన వశిష్ట, వి.అభిషేక్ సీళ్లు వేశారు. రంపచోడవరంలోని స్ట్రాంగ్ రూమ్‌లో ఈవీఎంలను భద్రపరిచి అన్ని రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థుల సమక్షంలో ఆర్వో ప్రశాంత్‌కుమార్ సీళ్లు వేశారు. వీటి వద్ద మూడంచెల భద్రత చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాలు, స్థానిక పోలీసులతో భారీ స్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు.



పాడేరులో స్ట్రాంగ్ రూమ్ వద్ద పటిష్ట భద్రత

న్యూస్‌రీల్

ప్రశాంతంగా ఎన్నికలు

- అందరికీ కృతజ్ఞతలు
- కలెక్టర్ విజయసునీత

సాక్షి,పాడేరు: జిల్లాలోని మూడు నియోజకవర్గాలలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.విజయ సునీత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సహకరించిన అన్ని వర్గాల ప్రజలు, వివిధ స్థాయి అధికారులు, ఎన్నికల సిబ్బందికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు జరిగాయన్నారు. అధికారులు, సిబ్బంది అత్యంత బాధ్యతతో పారదర్శకంగా విధులు నిర్వహించడం అభినందనీయమని ఆమె పేర్కొన్నారు.

ఏబులంలో రాత్రి పది వరకు పోలింగ్

గూడెంకొత్తవీధి: మండలంలోని ఏబులం పోలింగ్ కేంద్రంలో సోమవారం రాత్రి పది గంటల వరకు ఓటింగ్ కొనసాగింది. ఓటుహక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు భారీగా తరలివచ్చారు. 31వ బూత్‌లో 1,475 ఓట్లకు 1,012 పోలవగా 72 శాతం నమోదైంది. ఇదే కేంద్రంలో 32వ పోలింగ్ బూత్‌లో 1040కు 622 ఓట్లు పోల్ కాగా 60 శాతం నమోదైంది. వర్షం కురువడంతో ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది.


సింహాద్రి ఎన్టీపీసీకి ఎక్స్‌లెన్స్ అవార్డు



ప్రశంసాపత్రం

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ యాజమాన్యం మూడో పర్యాయం పర్యావరణ ఎక్స్‌లెన్స్ అవార్డును అందుకుంది. సింహాద్రి ఎన్టీపీసీ అందిస్తున్న ఉత్తమ సేవలను గుర్తించిన అపెక్స్ ఇండియా ఫౌండేషన్(న్యూఢిల్లీ) ఈ నెల 4న గ్రీన్ లీఫ్ ప్లాటినం అవార్డు–2023ను ప్రదానం చేసింది. ఈ ప్రతిష్టాత్మక అవార్డుకు సింహాద్రి ఎన్టీపీసీ మూడవ సారి ఎంపిక కావడం విశేషం. పచ్చదనం, పరిశుభ్రమైన పర్యావరణానికి కృషి చేసినందుకు ఈ అవార్డు దక్కిందని ఎన్టీపీసీ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

ఇస్కాన్‌లో ప్రారంభమైన ఐఐవైసీ సమావేశాలు



ప్రసంగిస్తున్న కమల్ లోచన్ ప్రభూ

కొమ్మాది (విశాఖ): సాగర్‌నగర్‌లోని ఇస్కాన్ మందిరంలో మూడు రోజుల పాటు జరిగే ఇస్కాన్ ఇండియా యూత్ కౌన్సిల్(ఐఐవైసీ) సమావేశాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి సనాతన ధర్మాన్ని బోధించడమే ఈ సమావేశాల ముఖ్య ఉద్దేశమని కమల్ లోచన్ ప్రభు తెలిపారు. ఆధ్యాత్మిక భావనలు, సనాతన ధర్మం విశిష్టతను తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. సనాతన ధర్మం ప్రచారంలో భాగంగా విశాఖ సాగర తీరంలో ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు హరినామ సంకీర్తన నిర్వహించారు. మూడు రోజుల పాటు భాగవత ప్రవచనాలు, ప్రతి రోజూ ఉదయం 4.30 గంటల నుంచి ప్రత్యేక హారతి కార్యక్రమాలు, నగర సంకీర్తన నిర్వహిస్తామని తెలిపారు. ఈ సమావేశాల్లో పరివ్రాజిక స్వామి మహారాజ్, రాధేశ్యామ్ ప్రభూ, ఇస్కాన్ అధ్యక్షుడు సాంబాదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని పాల్గొన్నారు.

పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ

కంచరపాలెం (విశాఖ): స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరియర్ సర్వీస్ సెంటర్‌లో ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ అన్వేషికులకు పలు కోర్సుల్లో జూలై 1 నుంచి ఉచితంగా ఏడాది పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఎస్సీ, ఎస్టీ సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ అధికారి నిట్టాల శ్యామ్ సుందర్ ఒక ప్రకటనలో తెలిపారు. కాంపిటేటివ్ పరీక్షలకు తర్ఫీదు శిక్షణ, 'ఓ'లెవెల్ కంప్యూటర్ ట్రైనింగ్, హార్డ్‌వేర్ ట్రైనింగ్, కంప్యూటర్ అప్లికేషన్, బిజినెస్, అకౌంటింగ్‌లో శిక్షణ, సైబర్ సెక్యూర్ వెబ్ డెవలప్‌మెంట్ అసోసియేట్‌లో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఏడాది కాలం శిక్షణ ఉంటుందని, ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 30 ఏళ్ల గల వారు అర్హులని తెలిపారు. ఆసక్తి గల వారు జూన్ 15లోపు https;//dbtscst.ncs.gov.in/users/signup వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

పాడేరులో జాతర సందడి

- ఈనెల 19 నుంచి మోదమ్మ ఉత్సవాలు
- చురుగ్గా ఏర్పాట్లు
- ముస్తాబవుతున్న పట్టణం



పాడేరులోని మోదకొండమ్మతల్లి విగ్రహం

సాక్షి, పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం, గిరిజనుల ఇలవేల్పు పాడేరులోని మోదకొండమ్మతల్లి ఉత్సవాలను ఈనెల 19వ తేదీ ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మూడు రోజుల పాటు జరిగే రాష్ట్రస్థాయి గిరిజన జాతరకు పాడేరు పట్టణం ముస్తాబు అవుతోంది. ఈ ఏడాది కూడా మోదమ్మ ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ, ఉత్సవ కమిటీలు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఉత్సవాలకు ప్రభుత్వ పరంగా సహకారం అందించాలని కలెక్టర్ ఎం.విజయసునీతకు ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొట్టగుల్లి సింహాచలంనాయుడు, తమర్బ ప్రసాద్‌నాయుడు, శ్రీను, వెంకటరమణ కోరారు. పాడేరు ఐటీడీఏ తరపున అన్ని విధాల సహకరించేందుకు గాను అధికారులతో ఐటీడీఏ పీవో అభిషేక్ సమావేశాలు నిర్వహించారు. ఉత్సవాలకు సంబంధించి పాడేరు పట్టణంలోని ప్రధాన రోడ్లకు ఇరువైపులా సుమారు ఐదు కిలోమీటర్ల పొడవునా విద్యుత్ దీపాల అలంకరణ పనులు జరుగుతున్నాయి. ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కొట్టగుల్లి రామారావు తదితరులు పేర్కొన్నారు.

వచ్చే నెల 29న మెగా లోక్ అదాలత్

విశాఖలీగల్: మెగా లోక్ అదాలత్ జూన్ 29వ తేదీన నిర్వహించనున్నట్లు విశాఖ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ తెలిపారు. మంగళవారం జిల్లా కోర్టులోని నూతన భవనం సమావేశ మందిరంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని న్యాయస్థానాల్లో రాజీ కలిగిన పెండింగ్ కేసులను పరిష్కరిస్తామని న్యాయమూర్తి పేర్కొన్నారు. ఇందులో రాజీ కలిగిన క్రిమినల్ సివిల్ కేసులు పొరశిక్షాస్మృతి పరిధిలోని అన్ని కేసులు, చెల్లని చెక్ కేసులు, సివిల్ తగాదాలు, బ్యాంకింగ్, బీమా కంపెనీలు, రాజీ కాగలిగిన కేసులు, విశాఖలోని కేంద్ర కార్యాలయాలు, జీవీఎంసీ, వీఎంఆర్డీఏ, పోర్టు, హిందుస్థాన్ షిప్ యార్డ్, విశాఖ స్టీల్ ప్లాంట్, వివిధ ప్రైవేట్ రంగ సంస్థలు తమ కేసులను రాజీ చేసుకోవచ్చని న్యాయమూర్తి స్పష్టం చేశారు. కుటుంబ న్యాయస్థానం సంబంధించి కొన్ని కేసులు మాత్రమే రాజీ చేస్తామన్నారు. అన్ని వివరాలకు జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయ సేవ ప్రాధికార సంస్థను సంప్రదించాలని కోరారు. సమావేశంలో న్యాయమూర్తితో పాటు న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జ్ ఎంవి శేషమ్మ, మెట్రోపాలిటీ సెషన్ జడ్జ్ ఎం.వెంకటరమణ, కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం ఉమ్మడి జిల్లాలో చెందిన న్యాయమూర్తులు పాల్గొన్నారు.

21 నుంచి జూలో సమ్మర్ క్యాంప్

ఆరిలోవ : ఇందిరాగాంధీ జూ పార్కులో ఈనెల 21న సమ్మర్ క్యాంప్ ప్రారంభంకానున్నట్లు జూ క్యూరేటర్ నందనీ సలారియా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంప్‌ల్లో చిన్నారులకు అరుదైన అనుభూతిని అందించే విధంగా వివిధ రకాల కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఈ క్యాంప్ రెండు విడతల్లో జరుగుతుందన్నారు. మొదట విడత బ్యాచ్ 5 నుంచి 11 సంవత్సరాల మధ్య పిల్లలకు ఈనెల 21 నుంచి 25 వరకు.. రెండో విడత బ్యాచ్ 12 నుంచి 18 సంవత్సరాల మధ్య పిల్లలకు ఈనెల 28 నుంచి జూన్ 1 వరకు నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగా అరుదైన పక్షి జాతులు గురించి తెలుసుకోవడానికి పరిశోధనలు, బర్డ్ వాచ్, 'గైడెడ్ జూ టూర్' పేరుతో జూలో ఉన్న వివిధ జాతుల వన్యప్రాణులు గురించి వివరిస్తారన్నారు. దీంతో పాటు జూలో వన్యప్రాణులకు అందిస్తున్న వైద్య సేవలు, జూలో వెటర్నరీ ఆస్పత్రి పరిశీలన తదితర కార్యక్రమాలు ఈ సమ్మర్ క్యాంప్‌లో నిర్వహిస్తామన్నారు. దీని కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 చెల్లించాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకొని పాల్గొన్న ప్రతివారికీ కిట్ అందిస్తామన్నారు. ఆసక్తి గలవారు 9440810213 నంబర్‌ను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆమె సూచించారు.

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు



8లో

కాయ్ రాజా కాయ్

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం
- రూ.లక్షల నుంచి కోట్లలో బెట్టింగులు
- కొన్నిచోట్ల పందేనికి భూములు కూడా..
- తేడా రాకుండా ఇరువర్గాల అగ్రిమెంట్లు
- ఓటమి భయంతో కూటమి నాయకుల వెనకడుగు



సాక్షి, విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మళ్లీ ప్రభంజనం స్పష్టం కావడంతో ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలేస్తోంది. రెండోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావడం ఖాయమన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. సోమవారం జరిగిన పోలింగ్ సరళితో పాటు ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వివిధ సంస్థలు జరిపిన సర్వేల్లో వైఎస్సార్‌సీపీకే ఓటర్లు పట్టం కట్టబోతున్నారని ఇప్పటికే తేటతెల్లం చేశాయి. దీంతో గెలుపుపై వైఎస్సార్‌సీపీ శ్రేణులతో పాటు పలువురు పందాలకు ముందుకొస్తున్నారు. పల్లెల్లోనే కాదు పట్టణాల్లోనూ భారీగా బెట్టింగులకు దిగుతున్నారు. పందాలపై ఆసక్తి ఉన్న వారు రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో ఏ పార్టీకి అనుకూలంగా ఓట్లు పోలయ్యాయన్న దానిపై సోమవారం సాయంత్రం నుంచే తమకున్న పరిచయాలు, ఇతర మార్గాల ద్వారా ఆరా తీయడం మొదలు పెట్టారు. ఏ ప్రాంతంలో, ఏ వర్గం ఓట్లు ఎంతమేర ఎవరికి ఎంత పడ్డాయి? వంటి అంశాలపై మంగళవారం నాటికి నిర్ధారణకు వచ్చారు. ప్రధానంగా వృద్ధులు, మహిళలు, పేద, మధ్య తరగతికి చెందిన ఓటర్లు అత్యధికంగా వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు చూపారు. ఇలా మెజార్టీ అంచనాలన్నీ వైఎస్సార్‌సీపీ గెలుపునే సూచిస్తుండడంతో ఓ నిర్ధారణకు వచ్చిన వీరు బెట్టింగులకు సిద్ధమయ్యారు. సోమవారం వరకు కూటమి గెలుస్తుందని ఊరేగిన వారంతా పోలింగ్ జరిగాక వెనక్కి తగ్గారు. ఇప్పుడు బెట్టింగ్‌లకు అంతగా ముందుకు రావడం లేదు. కొన్నిచోట్ల మాత్రం ఇంకా కూటమిపై ఆశలు పెట్టుకున్న వారు పందాలు కాస్తున్నారు. ముఖ్యంగా ఆయా నియోజకవర్గాల్లో బరిలో నిలిచిన అభ్యర్థులకంటే మళ్లీ ముఖ్యమంత్రి ఎవరన్న దానిపైనే బెట్టింగులకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రూ.లక్షల్లోను, అక్కడక్కడ రూ.కోట్లలోనూ సై అంటున్నారు. ఇంకొన్ని చోట్ల ఏకంగా భూములనే పణంగా పెడుతున్నారు. అంతేకాదు.. పందాలు కాసి ఫలితాలు వెలువడ్డాక తేడాలు రాకుండా లిఖిత పూర్వక అగ్రిమెంట్లు చేసుకుంటున్నారు.

రూ.లక్షల నుంచి కోట్ల వరకు..

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల్లో పందాల సందడి జోరుగా కనిపిస్తోంది. పెందుర్తి నియోజకవర్గంలో కొంతమంది రూ.5 లక్షల నుంచి 50 లక్షల వరకు బెట్టింగులకు దిగారు. ఇక్కడ మళ్లీ వైఎస్సార్‌సీపీనే అధికారంలోకి వస్తుందని కొందరు, సిటింగ్ ఎమ్మెల్యే అదీప్‌రాజే రెండోసారి గెలుస్తారని పందాలు కాశారు. ఈ నియోజకవర్గంలోని ఓ గ్రామంలో వైఎస్సార్‌సీపీ, కూటమి నాయకులు తమ పొంట పొలాలను పణంగా పెట్టి పందెం వేశారు. ఆ మేరకు సాక్షుల సమక్షంలో స్టాంపు పేపర్లపై ఒప్పంద పత్రాలు రాసుకున్నారు కూడా. అలాగే భీమిలి, విశాఖ తూర్పు, విశాఖ ఉత్తర, విశాఖ పశ్చిమ, గాజువాక, నర్సీపట్నం తదితర నియోజకవర్గాల్లో పందాలు జోరుగా సాగుతున్నాయి. ఈ నియోజకవర్గాల్లో కనీసం రూ.లక్ష నుంచి కోటి వరకు పందాలు నడుస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ, కూటమి అభ్యర్థుల మధ్య ఒకింత గట్టి పోటీ ఉన్న చోట్ల ఈ పందాలు మరింతగా కనిపిస్తున్నాయి. అలాంటి నియోజకవర్గాల్లో ఒకటికి రెండింతలు చొప్పున ఇచ్చేలా బెట్టింగులకు సిద్ధమవుతున్నారు. కాగా ఎన్నికల ముందు వరకు పందాలకు కాలు దువ్విన కూటమి శ్రేణులు.. పోలింగ్ తర్వాత వెనక్కి తగ్గారు. అదే సమయంలో గెలుపుపై ధీమాతో ఉన్న వైఎస్సార్‌సీపీ అభిమానులు మాత్రం దూకుడుగా ఉన్నారు.

క్లుప్తంగా

ఆలస్యంగా నడుస్తున్న రైళ్లు

తాటిచెట్లపాలెం: పెయిరింగ్ రైళ్ల ఆలస్యంగా నడుస్తున్నందున ఆయా స్టేషన్ల నుంచి బయల్దేరాల్సిన రైళ్ల రీ షెడ్యూల్ చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. అంతే ఆలస్యంగా ఈ రైళ్లు ఆయా స్టేషన్‌లకు రాకపోకలు సాగించనున్నాయి.

- 14వ తేదీ ఉదయం 10.15 గంటలకు బెంగళూరులో బయల్దేరాల్సిన బెంగళూరు-అగర్తలా(12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ సుమారు 20 గంటలు ఆలస్యంగా 15వ తేదీ ఉదయం 6గంటలకు బయల్దేరుతుంది.
- 14వ తేదీ ఉదయం 10 గంటలకు షాలిమర్‌లో బయల్దేరాల్సిన షాలిమర్-సికింద్రాబాద్(07226) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ 15వ తేదీ తెల్లవారు 2 గంటలకు బయల్దేరింది.
- 14వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు నాందేడ్‌లో బయల్దేరాల్సిన నాందేడ్-సంబల్‌పూర్(20810) ఎక్స్‌ప్రెస్ సుమారు రెండున్నర గంటలు ఆలస్యంగా రాత్రి 7గంటలకు బయల్దేరింది.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



మహిళకు చికిత్స అందిస్తున్న వైద్యసిబ్బంది

చింతూరు: మండలంలోని కాటుకపల్లి సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కృష్ణాజిల్లా గంపలగూడెంకు చెందిన సాదినేని లక్ష్మి(45) అనే మహిళ మృతిచెందింది. గంపలగూడెంకు చెందిన ఏడుగురు సభ్యులు గల కుటుంబం సోమవారం మారేడుమిల్లి అందాలను తిలకించేందుకు వచ్చారు. మంగళవారం తిరుగు ప్రయాణంలో వారు ప్రయాణిస్తున్న కారు కాటుకపల్లి వద్ద అటవీ ప్రాంతంలో అదుపు తప్పి చెట్టుకు బలంగా ఢీ కొంది. ఈ ఘటనలో లక్ష్మి అక్కడికక్కడే మృతిచెందగా, మరో నలుగురికి గాయాలు కాగా వారిని చికిత్సనిమిత్తం 108 వాహనంలో భద్రాచలం ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై చింతూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య ‘యోగం’



- చిన్నారుల యోగా శిబిరానికి మంచి స్పందన
- ఏకాగ్రత పెంచేలా యోగాసనాల్లో తర్ఫీదు
- వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు





యోగాసనాలు సాధన చేస్తున్న చిన్నారులు(అంతర చిత్రం) ప్రాణాయామంపై అవగాహన కల్పిస్తున్న శిక్షకురాలు

ఏయూ క్యాంపస్: యోగా సాధన ఆరోగ్యంతో పాటు ఏకాగ్రతను పెంచుతుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని వేసవి సెలవుల్లో భాగంగా ఏయూ యోగా విలేజ్‌లో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత యోగా శిబిరానికి విశేష స్పందన లభించింది. రోజూ ఉదయం వేళ ఒక గంట సమయం చిన్నారులు యోగాసనాలు, ప్రాణాయామం వంటివి అభ్యసించడానికి కేటాయిస్తున్నారు. శారీరకంగా, మానసికంగా ధృఢంగా తయారు కావడానికి ఇవి ఎంతగానో దోహదపడుతున్నాయి.

సూక్ష్మ వ్యాయాయం : నిత్యం 10 నుంచి 15 నిమిషాలు సూక్ష్మ వ్యాయామం చేయిస్తారు. తద్వారా శరీరంలో ప్రతీ అవయవాన్ని యోగాసనాలు వేయడానికి సిద్ధం చేయడం జరుగుతుంది.

బ్యాలన్సింగ్

చిన్నారుల్లో స్థిరత్వాన్ని కల్పించడానికి ఉపకరించే నటరాజ ఆసనం, త్రికోణాసనం, ఏకపాద ఆసనం, వంటివి నేర్పుతున్నారు.

- కంటికి బలాన్ని అందించేలా త్రాటక వ్యాయామం చేయిస్తున్నారు. కంటి సమస్యలను నివారించడానికి, కంటి చూపు మెరుగవడానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.
- శరీరంలో అన్ని అవయవాలను అనుసంధానం చేస్తూ, శరీరానికి అవసరమైన సంపూర్ణ వ్యాయామాన్ని అందించేలా సూర్యనమస్కారాలు సాధన చిన్నారులు రోజూ చేస్తున్నారు. వీటి వల్ల శ్వాస, జీర్ణ వ్యవస్థలు మెరుగవడం, శరీరంలో ఫ్లెక్షిబిలిటీ పెరుగుతుంది.
- వెన్నును బలోపేతం చేసే విధంగా భుజంగాసనం, దండాసనం తదితర ఆసనాలపై అవగాహన కల్పిస్తున్నారు. అదే విధంగా రక్త ప్రసరణ వ్యవస్థను ఇవి చైతన్యవంతం చేస్తాయి. మజిల్స్, జీర్ణ వ్యవస్థకు దోహదపడే ధనురాసనం నేర్పిస్తున్నారు.
- మనస్సుకు స్థిరత్వాన్ని ఇచ్చే ప్రాణాయామం, ఓం కారం సాధన వంటివి చివరగా చేయించడంతో రోజువారి శిక్షణ పూర్తవుతుంది.

సమాజంతో అనుసంధానం చేయడం..



ఏయూ యోగా విలేజ్‌ని సమాజంతో అనుసంధానం చేసేలా పని చేస్తున్నాం. దీనిలో భాగంగా అధికారులు సూచించిన విధంగా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ ఉచిత యోగ శిబిరానికి మంచి స్పందన లభించింది. చిన్నారులు ఎంతో ఆసక్తితో వస్తున్నారు.

– ఆచార్య కె.రమేష్‌బాబు, విభాగాధిపతి

యోగా చాలా బాగుంది..



యోగా విలేజ్‌లో శిక్షణ చాలా బాగుంది. ఇక్కడ నేర్చుకున్న అంశాలను ఇంటి దగ్గర సాధన చేస్తున్నాం. ఎంతో ఓపికగా నేర్పిస్తున్నారు. ఏకాగ్రత పెరగడానికి, బాగా చదవడానికి, శారీరక వ్యాయామానికి ఇవి ఉపయుక్తంగా నిలుస్తాయి.

– సమన్విత, విద్యార్థిని

ఏకాగ్రత పెరిగింది..



ఇక్కడ నిత్యం యోగా సాధన చేయడం వల్ల నాలో ఏకాగ్రత పెరిగింది. అదే సమయంలో కోపం, చిరాకు వంటివి బాగా తగ్గి ప్రశాంతంగా ఉంటున్నాను. ఒక విధమైన ప్రశాంత యోగాతో కలుగుతోంది.

– ఉమామహేశ్వరి, మద్దిలపాలెం

ఆసక్తిగా నేర్చుకుంటున్నారు..



చిన్నారులు ఎంతో ఆసక్తిగా యోగాసనాలు నేర్చుకుంటున్నారు. ఎంతో కష్టమైన ఆసనాలను సైతం సులభంగా వేస్తున్నారు. నిత్యం సాధన చేస్తే మంచి ఫలితాలు సాధిస్తారు. విభాగ ఆచార్యుల పర్యవేక్షణలో చిన్నారుల్లో ఏకాగ్రత పెంచే ఆసనాలు నేర్పించడం జరుగుతోంది.

– యామిని, పీజీ విద్యార్థిని, ఏయూ యోగా విలేజ్

ట్రైనీ ఐపీఎస్‌లకు ఎస్పీ అభినందన



ట్రైనీ ఐపీఎస్‌లతో ఎస్పీ మురళీకృష్ణ

అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొని పర్యవేక్షించిన నేషనల్ పోలీస్ అకాడమీకి చెందిన తొమ్మిది మంది ట్రైనీ ఐపీఎస్ అధికారులను కేవీ మురళీకృష్ణ అభినందించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకూ ఎన్నికల నిర్వహణను వీరు పర్యవేక్షించారన్నారు. ఇందులో భాగంగా పోలింగ్ రోజు బందోబస్తు ఏర్పాట్లు, బలగాల సమీకరణ, భద్రత సమస్యలు, సివిల్, పోలీస్ పరిపాలన విషయాలపై వివరించామన్నారు. జిల్లా పోలీసులు, పారామిలటరీ దళాలతో కవాతు, సెక్టార్ మొబైల్ ఫ్లయింగ్ స్క్వాడ్, నిఘా, పోలీస్ కంట్రోల్ రూమ్, చెక్‌పోస్టులు, పోలింగ్ బూత్, కౌంటింగ్ సెంటర్లకు ఈవీఎం తదితర అంశాలపై అవగాహన పొందారన్నారు. అనంతరం ట్రైనీ ఐపీఎస్‌లను శాలువాతో సత్కరించారు. అదనపు ఎస్పీ బి.విజయ్‌భాస్కర్, ఎన్నికల పోలీస్ పరిశీలకులు మోహన్, ఎం.దహిఖర్ తదితరులు పాల్గొన్నారు.

దేవుడికి ఓటు వేశా...

మునగపాక: ఏమ్మా ఓటు వేశావా.. ఆ వేశా.. ఎవరికి వేశావు.. ఇంకెవరికీ దేవునికి.. మండలంలోని అరబుపాలెంలో ఓ మహిళ తన మనసులో మాట ఇలా వ్యక్తం చేసింది. చేసిన మేలును గుర్తుంచుకోకపోతే ఇంకెందుకు.. అని కూడా ఆమె ప్రశ్నించింది. ఈ గ్రామానికి చెందిన మహిళ మంగళవారం నడుచుకుంటూ మునగపాక వైపునకు వస్తోంది. ఆ సమయంలో అటుగా పోతున్న మరో మహిళ ‘నిన్న ఓటు వేశావా’ అని అడగడంతో ‘ఆ వేశానమ్మా.. దేవునికే వేశాను’ అంటూ ఆమె బదులిచ్చింది. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని దృష్టిలో పెట్టుకొని ఆమె ఆ మాట అంది. జగన్ బాబు దయ వలన ఎంతోమంది లబ్ధి పొందుతున్నా.. కొంతమంది చేసిన మేలును గుర్తుంచుకోకపోవడం సరికాదంటూ ఆమె పేర్కొంది. సీఎం జగన్ ప్రజల మనసుల్లో ముద్ర వేసుకున్నారనడానికి ఇంతకంటే ఉదాహరణ ఇంకేం కావాలి.

అక్రమంగా మట్టి తవ్వకాలు



గోకివాడ రెవెన్యూ పరిధిలో మట్టి తవ్వకాలు జరుపుతున్న ప్రదేశం



కొత్తూరు పరిధిలో స్థలాల్లో మట్టిని తరలించిన దృశ్యం

- యథేచ్ఛగా రవాణా
- ట్రాక్టర్ రూ.1000కు అమ్మకం

రాంబిల్లి : మండలంలో అక్రమ మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి అక్రమార్కులు జేబులు నింపుకొంటున్నారు. రాత్రి పగలూ తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. గోకివాడ, కొత్తూరు, మామిడివాడ, మూలజంప పరిధిలో అక్రమ మట్టి తవ్వకాలు జోరుగా జరుగుతున్నాయి. యంత్రాల సాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల సాయంతో లేఅవుట్లు, ఇతర స్థలాలకు తరలిస్తున్నారు. ట్రాక్టరు మట్టిని రూ 1000 నుంచి రూ 1200 అమ్ముతున్నారు. పంచదార్ల పరిధిలో కంకరను అనుమతులు లేకుండా పగలే గాక రాత్రి వేళల్లోనూ తరలిస్తున్నారు. అనుమతులు లేకుండా కంకర, మట్టిని తరలిస్తుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. అధికారుల వ్యవహార శైలి కారణంగానే మట్టి తవ్వకాలు యథేచ్ఛగా సాగుతున్నాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఇంకొన్నాళ్లు రైళ్లు రద్దు

తాటిచెట్లపాలెం: దక్షిణ మధ్య రైల్వే, విజయవాడ డివిజన్ పరిధిలో జరుగుతున్న భద్రతా పనుల నిమిత్తం ఈ మార్గంలో నడుస్తున్న పలు రైళ్లు మరికొంతకాలం రద్దు చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. గుంటూరు-విశాఖపట్నం(17239) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు, విశాఖపట్నం-గుంటూరు (17240) సింహాద్రి ఎక్స్‌ప్రెస్ ఈ నెల 16వ తేదీ నుంచి 27వ తేదీ వరకు, విశాఖపట్నం-గుంటూరు-విశాఖపట్నం(22701/22702) ఉదయ్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15వ తేదీ నుంచి 26వ తేదీ వరకు, రాజమండ్రి-విశాఖపట్నం-రాజమండ్రి(07466/07467) స్పెషల్ ఈ నెల 15వ తేదీ నుండి 26వ తేదీ వరకు రద్దయినట్లు పేర్కొన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తులు

కంచరపాలెం: జిల్లాలోని ప్రభుత్వ/ప్రైవేట్ పారిశ్రామిక శిక్షణ కేంద్రాల్లో(ఐటీఐ) 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇందు కోసం https:// iti.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా జూన్ 10లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలకు ఒక దరఖాస్తు సరిపోతుంది. నమోదు చేసుకున్న విద్యార్థులు ఈ నెల 20 నుంచి జూన్ 10వ తేదీ లోగా ప్రభుత్వ ఐటీఐ(ఓల్డ్) కంచరపాలెం, ప్రభుత్వ ఐటీఐ(బాలికలు)-ఇండస్ట్రీయల్ ఎస్టేట్, ప్రభుత్వ ఐటీఐ(కొత్తది)-గాజువాక, ప్రభుత్వ ఐటీఐ-నరవలో వెరిఫికేషన్ చేయించుకుని కౌన్సెలింగ్‌కు అర్హత సాధించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ఆర్ కార్డుకు సంబంధించిన అభ్యర్థులు ప్రత్యేక కేటగిరీలో దరఖాస్తు చేసుకుని విధిగా వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు.

22న సింహగిరిపై నృసింహ జయంతి

- అదేరోజు నృసింహ హోమం
- ఆన్‌లైన్‌లో టికెట్లు
- ఈవో శ్రీనివాసమూర్తి

సింహాచలం: సింహగిరిపై ఈనెల 22న నృసింహ జయంతిని నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. అదేరోజు స్వాతి నక్షత్రం కూడా కావడంతో శ్రీ నృసింహ హోమాన్ని కూడా వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఏర్పాట్లపై సింహగిరిపై మంగళవారం దేవస్థానం వైదికులు, అధికారులతో ఈవో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఈసారి నృసింహహోమాన్ని ఆలయ ఉత్తర రాజగోపురం ఎదురుగా ఉన్న విశాల ప్రాంగణంలో నిర్వహిస్తామన్నారు. స్వాతి హోమంలో పాల్గొనే భక్తులు ఛ్ఖైరు ఞ్యట్ఛ ఞజౌఠి.జీఠ వెబ్‌సైట్ లోకాని, సింహగిరిపై ఉన్న పీఆర్‌వో కార్యాలయంలో కానీ టికెట్లు పొందవచ్చని తెలిపారు. స్వయంగా నృసింహహోమంలో పాల్గొనలేని భక్తులు పరోక్షంగా పాల్గొనే అవకాశం ఉందన్నారు. వారు కూడా పైన పేర్కొన్న వైబ్‌సైట్‌లో టికెట్లు తీసుకోవచ్చన్నారు. స్వాతి హోమం టికెట్ ధర రూ.2,500 ఉంటుందని తెలిపారు. అదేరోజు సాయంత్రం దేవస్థానంకి చెందిన శ్రీకృష్ణాపురంలో ఉన్న నృసింహస్వామి విగ్రహం వద్ద కూడా నృసింహ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు.

చందనోత్సవం విజయవంతం కావడంతో ఈవోకి అభినందలు

ఈనెల 10న జరిగిన చందనోత్సవం విజయవంతం కావడంతో దేవస్థానం ఉద్యోగులంతా ఈవో శ్రీనివాసమూర్తిని అభినందించారు. సమావేశం అనంతరం ఆయన్ని దుశ్శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. సమావేశంలో స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యుల, ఈఈ రాంబాబు, ఏఈవోలు రమణమూర్తి, రాజేంద్రకుమార్, నరసింహరాజు, నరసింగరావు, సూపరింటెండెంట్లు అప్పలనాయుడు, వెంకటరమణ, ఎనమండ్ర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

23న వైశాఖ పౌర్ణమి పూజలు

సీతంపేట: వైశాఖ మాసం పౌర్ణమి సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితా పీఠంలో విశేష పూజలు చేయనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. ఈ నెల 23న ఉదయం 7.30 గంటలకు రమాసత్యనారాయణ స్వామికి పంచామృత అభిషేకం, మణిద్వీపంలో శ్రీచరఖ వనావరణ, అలాగే లలితా అమ్మవారి సన్నిధిలో శ్రీచక్ర నవావరణ జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు పీఠంలో రాజశ్యామల హోమం నిర్వహిస్తామని, పాల్గొనదలిచే భక్తులు పీఠం కార్యాలయంలో సంప్రదించాలని ఆయన కోరారు.

వడదెబ్బకు వ్యక్తి మృతి



దుర్గారావు(ఫైల్)

పెదగంట్యాడ: నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో వడదెబ్బ తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. న్యూపోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. ఎ.దుర్గారావు (48) అయ్యన్నపాలెంలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో తన ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ బూత్‌కు వెళ్లాడు. మార్గమధ్యంలో ఎండ దెబ్బకు రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి వెంటనే సపర్యాలు చేశారు. ఆపై 108కు సమాచారం అందజేశారు. 108 సిబ్బంది అక్కడకు చేరుకుని పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. న్యూపోర్టు పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దుర్గారావు భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఆర్‌ఎస్ ఫలితాల్లో పిండ్రంగి విద్యార్థికి మొదటి ర్యాంక్



మల్లవరపు కీర్తి

కె.కోటపాడు: ఏపీఆర్‌ఎస్‌లో 5వ తరగతిలో ప్రవేశానికి నిర్వహించిన ఎంట్రన్స్ పరీక్షలో కె.కోటపాడు మండలం పిండ్రంగి గ్రామానికి చెందిన మల్లవరపు కీర్తి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించింది. ఏపీఆర్‌ఎస్ ఎంట్రన్స్ పరీక్షను గత నెల 25న నిర్వహించారు. ఫలితాలు మంగళవారం వెలువడ్డాయి. ఈ పరీక్షలో 100కి 99 మార్కులు పొందిన కీర్తి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించింది. పిండ్రంగి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో కీర్తి చదువుతోంది. ఆమె తండ్రి గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికుడిగా పనిచేస్తున్నారు. రాష్ట్రస్థాయిలో కీర్తి మొదటి ర్యాంక్ సాధించడం పట్ల పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ బాదిరెడ్డి దేవి, హెచ్‌ఎం బంగారునాయుడు, రమేష్, గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

అపార్ట్‌మెంట్‌లో వ్యక్తి మృతదేహం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడ కళా గ్రామం సమీపంలోని వుడా అపార్ట్‌మెంట్‌లో ఓ వ్యక్తి మృతదేహం కలకలం రేపింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ అపార్ట్‌మెంట్‌లో ఓ గది నుంచి దుర్వాసన రావడంతో ఇక్కడ నివాసులు మంగళవారం భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు చేరుకుని గదిలోకి వెళ్లి చూడగా ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. సుమారు నాలుగైదు రోజుల క్రితం వ్యక్తి చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. శ్యామ్ శివ ప్రసాద్‌గా గుర్తించారు. ఇక్కడకు ఎలా వచ్చాడు. ఎక్కడ నుంచి వచ్చాడు. ఇది హత్యా, ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి పూర్తి వివరాలు తెలియరాలేదని, వివరాలకు భీమిలి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

మధ్యవర్తిత్వం ద్వారా కేసుల రాజీ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్, చిత్రంలో పలువురు న్యాయమూర్తులు

విశాఖ లీగల్: మధ్య వర్తిత్వం ద్వారా కేసులు రాజీ చేసుకుంటే శాశ్వత ఫలితాలు పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయమూర్తుల సమావేశ మందిరంలో మంగళవారం ‘మధ్యవర్తిత్వం న్యాయ సేవ ప్రాధికార సంస్థ సేవలు’అనే అంశంపై జరిగిన సదస్సులో ఆయన ప్రసంగించారు. అపరిష్కృతంగా ఉన్న కేసులను కక్షిదారులు, వివిధ సంస్థలు మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకుంటే ఎన్నో లాభాలు ఉన్నాయన్నారు. మెట్రోపాలిటన్ ప్రధాన సెషన్స్ జడ్జి ఎం.వెంకటరమణ మాట్లాడుతూ న్యాయస్థానాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు కక్షిదారులకు మంచి ఫలితాలు వస్తాయన్నారు. రాజీమార్గమే రాజమార్గం అన్నారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు బెవరా సత్యనారాయణ మాట్లాడుతూ మధ్యవర్తిత్వానికి న్యాయవాదుల సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. న్యాయ సేవప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కుటుంబ న్యాయస్థానం న్యాయమూర్తి రాధారత్నం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల అదనపు జిల్లా న్యాయమూర్తులు, సీనియర్ సివిల్ జడ్జిలు, జూనియర్ సివిల్ జడ్జిలు, న్యాయమూర్తులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఇంకా జీతాల్లేవు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు ఈనెల 15వ తేదీ వచ్చినా జీతాలు అందలేదు. అటు యాజమాన్యం, ఇటు కార్మిక సంఘాల తీరుపై ఉద్యోగుల్లో తీవ్ర అసహనం వ్యక్తమవుతోంది. నగరంలోని అన్ని పరిశ్రమల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రత్యేక స్థానం ఉండేది. స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు కూడా ఆ గుర్తింపు కూడా లభించేది. అయితే గత ఆరు నెలలుగా వారి దుస్థితి దుర్భరంగా మారింది. ఎప్పుడు జీతాలు అందుతాయో తెలియని పరిస్థితి ఉద్యోగుల్లో నెలకొంది. గతంలోని బీఐఎఫ్ఆర్ సమయంలో, కరోనా సమయంలో కూడా నాటి యాజమాన్యాలు ఉద్యోగుల జీతాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవి. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాలో లేక యాజమాన్యం ఉద్దేశపూర్వక చర్యలో తెలియదు కాని ఇటీవల జీతాలకు ఆ ప్రాధాన్యత లేకుండా పోయింది. జీతాలు చివర ప్రాధాన్యతగా మారడంతో ఉద్యోగులకు కష్టాలు తప్పడం లేదు. ప్రతీ ఉద్యోగికి పిల్లల ఉన్నత విద్యాభాసం, అనారోగ్య పరిస్థితులు, ఈఎంఐ వంటి ఖర్చులు వెన్నంటి ఉంటున్నాయి. జీతాల చెల్లింపులో జరుగుతున్న అస్తవ్యస్త విధానం వల్ల ఇటీవల కాలంలో దాదాపు అందరూ ఉద్యోగులు డిఫాల్టర్లుగా మారుతున్నారు. అసలు ఈ పరిస్థితులకు కారణాలు పరిశీలిస్తే కార్మిక సంఘాలు అని చెప్పక తప్పదు. అయిన దానికి, కాని దానికి ధర్నాలు, రాస్తారోకోలు, ముట్టడిలు చేసే ప్రధాన కార్మిక సంఘాలు 15వ తేదీ వచ్చినా జీతాలు చెల్లించకపోయినా పట్టించుకోక పోవడం పట్ల ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాజమాన్యం వద్ద వారి లొంగుబాటుతనమే అని కార్మికులు బాహాటంగా విమర్శిస్తున్నారు. ఇక గుర్తింపు యూనియన్ ఉందన్న విషయాన్ని కార్మికులు దాదాపు మర్చిపోయారు. తమ సొంత పనుల పట్ల ఉన్న శ్రద్ధ కార్మికుల జీతాలపై లేకపోవడం పట్ల కార్మికుల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. ఏది ఏమైనా యాజమాన్యం ఇచ్చినప్పుడు తీసుకోవడం పట్ల కార్మిక సంఘాల పట్ల నమ్మకం పోయిందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

లక్ష్మీపూర్‌రోడ్-టికిరి రెండో లైన్ పనుల పరిశీలన



విండో ట్రయలింగ్ ద్వారా ట్రాక్‌లను పరిశీలిస్తున్న సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్



రెండవ లైన్ పనులను పరిశీలిస్తున్న సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో కె.ఆర్.సెక్షన్‌లో నూతనంగా చేపట్టిన లక్ష్మీపూర్‌రోడ్-సింగారం-టికిరి రెండవ లైన్ పనులను సౌత్ ఈస్టన్ సర్కిల్ రైల్వే సేఫ్టీ కమిషనర్ బ్రిజేష్‌కుమార్ మిశ్రా మంగళవాం పరిశీలించారు. ప్రతికూల పరిస్థితుల్లో ఈ ప్రాజెక్టు పనులను విజయవంతంగా పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. కోరాపుట్-సింగపూర్ రోడ్ రెండవ లైన్ పనుల్లో భాగంగా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తున్నారు. సేఫ్టీ కమిషనర్‌తో వాల్తేరు అధికారులు విండో ట్రయలింగ్ ద్వారా ట్రాక్‌లను పరిశీలించారు. స్టేషన్‌లో ఏర్పాటు చేసిన వసతులపై ఆరా తీశారు. వాల్తేరు డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎ.జి.శ్రీనివాస్, చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ ఎం.సనసన వాలా, చీఫ్ బ్రిడ్జి ఇంజినీర్ వి.ఎస్.కె రాజ్‌కుమార్, చీఫ్ ఇంజినీర్ అశోక్‌కుమార్, ఏడీఆర్‌ఎం(ఇన్‌ఫ్రా) సుధీర్‌కుమార్ గుప్తా, డిప్యూటీ చీఫ్ ఇంజినీర్ విష్ణుమూర్తి, ఇతర అధికారులు పాల్గొన్నారు.